
వక్ఫ్ భూముల పరిరక్షణపై దృష్టేదీ..!

పాలమూరులో ఏడు వేల ఎకరాల్లో ఆక్రమణలు



మహబూబ్‌నగర్‌లో ఓ ప్రాంతంలో వక్ఫ్‌భూములు అంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ఈనాడు, మహబూబ్ నగర్: పాలమూరులో వక్ఫ్ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటంలేదు. పూర్వ మహబూబ్‌నగర్‌లో 4,561 సంస్థలకు 11,500.18 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. వీటిలో సుమారు ఏడు వేల ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమైనట్లు గతంలోనే వక్ఫ్ బోర్డు గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో 1,592 చిల్లాలు, 1,523 అసూర్‌ఖానాలు, 766 ఖబర్‌స్థాన్‌లు, 297 మజీదులు, 223 దర్గాలు, 160 ఇతర సంస్థలకు ఈ భూముల కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం వీటిలో సగానికిపైగా భూములు వివిధ ప్రాంతాల్లో కబ్జాల్లో ఉన్నాయి. వీటి పరిరక్షణలో వక్ఫ్ బోర్డు ఉదాసీనత ప్రదర్శిస్తుండటంతో ఈ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం వక్ఫ్ భూముల క్రయవిక్రయాలు చేయకూడదు. ఉమ్మడి జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఈ భూములపై వివాదాలు నెలకొంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో వక్ఫ్ భూములు పలు ప్రాంతాల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ముఖ్య ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల సహకారంతో పలుచోట్ల ఈ భూములను రికార్డుల్లోనూ లేకుండా చేస్తున్నారు. భూములు కబ్జా అయినట్లు గుర్తించిన వక్ఫ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రెండు సర్వే నంబర్లలో 13 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. మిగతా స్థలాల్లోనూ ఇతరుల కన్ను పడింది. తొలుత చిన్నపాటి షెడ్డులు వేసుకుని తర్వాత ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఇక్కడ ఎకరా విలువ సుమారు రూ.2 కోట్లకుపైగానే ఉంటుంది.
- నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో మొత్తం 460 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు, నిడుగుర్తి, పెద్దజట్రంలో ఈ భూములున్నాయి. కేవలం ఊట్కూర్‌లోనే 328 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలుండగా ఇప్పటికే పలు భూములు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. గతంలో ఈ భూములను కొందరు స్థిరాస్తి వ్యాపారికి విక్రయానికి పెట్టడం వివాదాస్పదమైంది. తర్వాత కూడా ఈ భూములను అధికారులు పట్టించుకోవడం మానేశారు.
- వనపర్తి జిల్లా అమరచింతలోని ఓ దర్గాకు వివిధ సర్వే నంబర్లలో 60 ఎకరాలకుపైగా స్థలాలున్నాయి. ఈ భూముల్లో సగానికిపైగా అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసినా ఫలితం లేకపోయింది.
- గద్వాల పట్టణంలోనూ వక్ఫ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టారని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి విచారణ జరగలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ కొన్నిచోట్ల వక్ఫ్ స్థలాలు కనిపించడం లేదు.

పూర్తిస్థాయిలో సర్వే చేస్తే..

వక్ఫ్ భూములపై అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయడం లేదు. సర్వే చేసి హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు ఈ భూములపై నిరంతరం నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం కమిటీల వివరాలు కావాలని ఇటీవలే ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ భూముల పరిరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 90శాతం భూములు గెజిట్‌లో ఉన్నాయని, వీటిని అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదన్నారు.

పురాల్లో తాగునీటి ఎద్దడికి మోక్షం..!

- కొత్త కాలనీలకు మిషన్ భగీరథ
- అమృత్ 2.0 కింద నిధులు మంజూరు


నాగర్‌కర్నూల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయానికి వెళ్లేదారిలో ఏర్పడిన కొత్తకాలనీ

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్, కల్వకుర్తి పురపాలక సంఘాలలో విస్తరిస్తున్న కొత్త కాలనీలకు ఎట్టకేలకు మిషన్ భగీరథ నీళ్లు రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకం కింద మంజూరైన నిధులతో పనులను చేపట్టనున్నారు. పెద్ద మొత్తంలో నిధులు రావడంతో దాదాపు అన్ని ప్రాంతాలకు నీటి సౌకర్యం కల్పించే విధంగా పైపులైన్లు వేయనున్నారు. నాగర్‌కర్నూల్ పట్టణానికి రూ.30 కోట్లు, కల్వకుర్తి పట్టణానికి రూ.25 కోట్లు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. కొత్త కాలనీలకు విస్తరించేలా పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణాలు, సంపుల ఏర్పాటుకు నిధులు రావడంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించినట్లయింది. కొత్త కాలనీలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

48 కి.మీ పైపులైను ఏర్పాటు... : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పట్టణం పెద్దఎత్తున విస్తరించి కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. అప్పట్లో పట్టణంలోనే మిషన్ భగీరథ పథకం కింద పనులు పూర్తి చేసి తాగునీరు ఇచ్చారు. పట్టణంలో సంపు లేకపోవడంతో సరిపడ నీటిని అందించలేకపోతున్నారు. ఇప్పుడు అమృత్ 2.0 కింద వచ్చిన నిధులతో 48 కిలోమీటర్ల పైపులైన్ వేయనున్నారు. కొల్లాపూర్ చౌరస్తా పరిసర ప్రాంతంలో సంపు నిర్మాణం, ట్యాంకును నిర్మించి కాలనీలకు నీరందిస్తారు. కొల్లాపూర్ చౌరస్తాతో పాటు శ్రీపురం రోడ్డులో బీసీ కాలనీ, ఉయ్యాలవాడ సమీపంలో కాలనీలు, పాత ఆర్డీవో కార్యాలయం ప్రాంతంలో ఉన్న కాలనీ, అయ్యప్ప దేవాలయం వెళ్లే ప్రాంతంలో కాలనీలకు పైపులైన్లు వేసి నీరందించనున్నారు. కల్వకుర్తి పట్టణంలో విస్తరించిన కాలనీలలో కొత్తగా ట్యాంకులు, స్టక్చర్లు, పైపులైను ఏర్పాటు చేయనున్నారు. పట్టణానికి దూరంగా ఉన్న ప్రాంతాలకు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పైపులైన్లు ఇప్పుడే వేసి పెట్టాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు. నిధులను పూర్తి స్థాయిలో వినియోగిస్తే నాగర్‌కర్నూల్, కల్వకుర్తి పట్టణాలకు తాగునీటి ఎద్దడి పూర్తిగా నివారించే అవకాశం ఉంది.

పనులను ప్రారంభించాల్సి ఉంది.. : రాష్ట్రంలో ఉన్న 42 పురపాలక సంఘాలకు ఒకేసారి అమృత్ 2.0 కింద మంజూరైన పనులకు టెండర్లు జరిగి అగ్రిమెంట్లు చేసుకునే ప్రక్రియ పూర్తయింది. డిజైన్లను రుపొందించుకుని పనులను ప్రారంభించాల్సి ఉంది. సంపు, ట్యాంకులను ఎక్కడ నిర్మించాలనేది పరిశీలన చేస్తున్నాం.

- శివ, ఏఈ, నాగర్‌కర్నూల్ పురపాలక సంఘం.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,427

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న క్రయవిక్రయాలు నిర్వహించారు. క్వింటా గరిష్ఠ ధర రూ.2,427, మాదిరి ధర రూ.1,719, కనిష్ఠ ధర రూ.1,659 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. తేమ ఉన్న మొక్కజొన్న పంటను మార్కెట్ ఆవరణలో ఎండబెట్టి విక్రయిస్తున్నారు.

మామిడి సాగులో యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

కోడేరు, న్యూస్‌టుడే : మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కొల్లాపూర్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్ సూచించారు. కోడేరు మండలం నర్సాయిపల్లి రైతువేదికలో మామిడి రైతులకు జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను మెగా క్లస్టర్‌గా ఎంపిక చేసిందన్నారు. జిల్లాలో 57 వేల ఎకరాల్లో మామిడి తోటల సాగు అవుతోందని, దీనికి దేశ విదేశీ మార్కెట్‌లో అధిక లాభాలు వచ్చేలా వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అనంతరం కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే) ఉద్యాన శాఖ శాస్త్రవేత్త ఆదిశంకర్ మామిడి సాగులో సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆయిల్‌పాం ప్రాంతీయ మేనేజర్ రాకేశ్, క్లస్టర్ అధికారులు చంద్రశేఖర్, అజయ్, ఏఈవోలు పృథ్వీరాజ్, సువర్ణ, నవ్యభారతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఆదిశంకర్

ఎంవీఎస్ కళాశాలకు మహర్దశ

రూ.10కోట్లతో త్వరలో పీజీ విద్యార్థినుల వసతిగృహం నిర్మాణం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

న్యూస్‌టుడే, పాలమూరు : ఉమ్మడి జిల్లాకే కీలకమైన మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు మహర్దశ రానుంది. ఇక్కడి పీజీ విద్యార్థినుల కోసం పీఎం ఉష పథకం కింద రూ.10 కోట్ల నిధులతో బాలికల వసతి గృహం మంజూరైంది. కళాశాలలో 3,910 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎంవీఎస్ నాలుగో స్థానంలో ఉంది. అందుకే రాష్ట్రంలో ములుగు కళాశాలతో ఎంవీఎస్‌కు పీజీ బాలికల వసతిగృహం మంజూరు చేశారు. దీన్ని కళాశాల ప్రాంగణంలో ఇప్పటికే ఉన్న బాలికల వసతి గృహం పక్కనే రెండు అంతస్తులతో విశాలంగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా నిర్మించనున్నారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో దసరా తర్వాత పనులను చేపట్టనున్నారు. ఈ భవన నిర్మాణానికి కేంద్రం రూ.6కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లను మంజూరు చేసింది.

ఉద్యోగార్థులకు కూడా వసతి : ఎంవీఎస్ కళాశాలలో ఇప్పటికే ఉన్న వసతిగృహంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నా అది ఏమాత్రం సరిపోవటం లేదు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సులను 500ల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొత్త వసతిగృహం నిర్మిస్తే దాన్ని పీజీ విద్యార్థినులకే కేటాయిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మహిళలు, విద్యార్థినులకు కూడా ఎలాంటి రుసుము లేకుండా వసతి, భోజనం కల్పిస్తారు. 250 మంది ఉండే నిర్మించే ఈ వసతి గృహంలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేసి పోటీ పరీక్షల పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచుతారు. వసతి గృహం ముందు చిన్న ఉద్యానం కూడా ఏర్పాటు చేస్తారు.

100 గదుల ప్రణాళికకు పచ్చజెండా : కళాశాలలో ఏటా కొత్త కోర్సులు మంజూరవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా ఏటికేడు పెరుగుతోంది. ఇప్పటికే ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో రూ.70 కోట్ల వ్యయంతో రెండస్తుల్లో 100 తరగతి గదులను నిర్మించడానికి రూపొందించిన బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం నుంచి పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. దాతలు, పూర్వ విద్యార్థుల అందించే విరాళాలతో వీటిని నిర్మించాలని కళాశాల యాజమాన్యం యోచిస్తోంది.



అన్ని రంగాల్లో ముందుంచుతాం.. : ఎంవీఎస్ కళాశాలలోనే నేను చదివాను. ఇప్పుడు ఆ ప్రిన్సిపల్‌గా పనిచేయటం గొప్ప అనుభూతి. కళాశాల అభివృద్ధికి నా నెల వేతనంలో సగం ఇస్తాను. నాతో పాటు చాలా మంది సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. అందరి సౌజన్యంతో కళాశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పీఎం ఉష కింద మంజూరైన వసతిగృహం నిర్మాణ పనులు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీకి ప్రభుత్వం అప్పగించింది.

- కె.పద్మావతి, ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

బస్టాండులో నాలా తొలగింపునకు అడుగులు

- ‘ఈనాడు’ వరుస కథనాలతో కదలిక
- రూ.2 కోట్ల అంచనాతో ఈఎన్‌సీకి ప్రతిపాదనలు


ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం మీదుగా ప్రవహిస్తున్న పెద్ద చెరువు నాలా

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికులకు దుర్గంధం వెదజల్లుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రాణ సంకటంగా పరిణమించిన పెద్దచెరువు మురుగు నాలా తొలగింపునకు అడుగులు పడుతున్నాయి. ఈ మురుగు నాలాపై ‘ఈనాడు’లో వరుస కథనాలు ఇస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుజాత ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, డిపో ఉద్యోగులు అనారోగ్యాల బారినపడుతున్న వైనాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మురుగు కాల్వ దారి మళ్లించే విషయమై పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనతో ఇటీవల పురపాలక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ప్రయాణ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న పెద్దచెరువు నాలా దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ తర్వాత పురపాలక ఈఈ బస్వరాజ్, వారి ఇంజినీరింగ్ బృందంతో ఆర్టీసీ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న నాలాను పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్, పీర్లబావి వైపు డిపో వెనక ప్రదేశాన్ని కూడా పరిశీలించి నాలాను ఎక్కడి నుంచి ఎలా దారి మళ్లించాలో ఒక అంచనాకు వచ్చారు. అంబేడ్కర్‌నగర్ సామాజిక భవనం వద్ద బస్టాండు వైపు పెద్దచెరువు నాలా దారి మళ్లిన విషయం తెలిసిందే. నాలా మొత్తం బస్టాండు ఆవరణ గుండా వెళ్లకుండా చర్యలు చేపడతారు. బస్టాండు ప్రహరీ లోపల 3 మీటర్ల విస్తీర్ణంతో 2 మీటర్ల లోతుతో డిపో ప్రహరీ వెనక భాగం గుండా పీర్లబావి వైపు దారి మళ్లిస్తారు. ఇలా 300 మీటర్ల వరకు నాలాను పొడిగిస్తూ పెద్దచెరువు వరకు నిర్మిస్తారు. ఈ పనుల కోసం రూ.2కోట్ల నిధులు అవసరమని ఈఈ బస్వరాజ్ అంచనా వేశారు. ఈ నివేదికను గత నెల రెండో వారంలో అటు ప్రజారోగ్య శాఖ ఈఎన్‌సీకి, ఇటు సీడీఎంఏకు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే బస్టాండు గుండా ప్రవహిస్తున్న నాలాను దారి మళ్లించే పనులు చేపడతామని ఈఈ ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.


డిపో ప్రహరీ పక్క నుంచి పెద్దచెరువు వైపు నాలా పొడిగిస్తూ నిర్మించాల్సిన ప్రదేశం

వెయ్యి టీఎంసీలకు చేరువలో..

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు గత 16 ఏళ్ల వ్యవధిలో వచ్చిన వరదను పరిశీలిస్తే ఇప్పటి మూడు సార్లు మాత్రమే వెయ్యి టీఎంసీలు దాటింది. ఈ ఏడాది మరో నాలుగైదు రోజుల్లో నాలుగోసారి వరద వెయ్యి టీఎంసీలు దాటనుంది. జులై 19 తేదీ ప్రాజెక్టుకు వరద మొదలైంది. ఆగస్టు చివరి వారంలో అత్యధికంగా 3.89 లక్షల క్యూసెక్కులు నమోదైంది. 75 రోజుల వ్యవధిలో జూరాలకు 950.70 టీఎంసీల వరద చేరింది. మంగళవారం జూరాలకు 95వేల క్యూసెక్కుల వరద కొనసాగుతోంది.

ఏడాది	వరద (టీఎంసీల్లో)
2015-16	45
2016-17	378
2017-18	315
2018-19	1460
2019-20	1425
2020-21	866
2021-22	820
2022-23	1236
2023-24	155
2024-	950
(అక్టోబర్ 1 తేదీ వరకు)	

క్షేత్రస్థాయిలో పరిశీలించాకే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఆమోదం: కలెక్టర్


కలెక్టరేట్ సమీపంలో ప్లాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆమోదించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కలెక్టరేట్ సమీపంలో ఉన్న సర్వే నంబరు 73లో ప్లాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఆర్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. న్యాయబద్ధంగా ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వరలక్ష్మి, సిబ్బంది వరలక్ష్మి, వెంకన్న, భరత్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో పౌరులు బాధ్యతగా మెలగాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేశ్‌బాబు


పట్టణంలో కోర్టు పరిసరాలు శుభ్రం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేశ్‌బాబు తదితరులు

కందనూలు, న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రతలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేశ్‌బాబు అన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణంలో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులను నివారించడానికి వీలు అవుతుందన్నారు. న్యాయవాదులతో కలిసి కోర్టు పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి పట్టణంలో మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.సబితా, జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.మౌనిక, న్యాయవాదులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా పరీక్షలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్‌ను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ‘స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్’ పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040-23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లు అడ్డుకున్న ఏచూరి

సంస్మరణ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు


సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ మధు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అప్పట్లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లును సీతారాం ఏచూరి అడ్డుకున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణం అంబేడ్కర్ కళాభవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అధ్యక్షతన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఏచూరికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మధు ప్రసంగిస్తూ ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బీమా ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెడితే తన వాదనతో వెనక్కి పంపేలా చేశారని పేర్కొన్నారు. ఏచూరి ఎంపీగా పార్లమెంటులో గళమెత్తారని, బయట ప్రజా సమస్యలపై పోరాడి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఆయన మరణం వామపక్ష పార్టీలకు, దేశాభివృద్ధికి తీరని లోటన్నారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కూడా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ పెట్రో, డీజిల్ ధరలు తగ్గించకపోవడం దారుణమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను నేరుగా భర్తీ చేసే రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. లౌకికవాద భారతదేశంలో ఒక దేశం, ఒకే ఓటు పేరుతో జమిలి ఎన్నికలు తేవాలన్న ప్రధాని మోదీ ఆలోచన సఫలీకృతం కాదన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ సీతారాం ఏచూరి మహాజ్ఞాని అని కొనియాడారు. ఏచూరితో పాటు ఓ వేదిక పంచుకున్నానని, ఈ సందర్భంగా ఆయన భారత తత్వశాస్త్రంపై అనర్గళంగా మాట్లాడారని గుర్తుచేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరనిలోటన్నారు. సభలో పురపాలక సంఘం ఆనంద్ కుమార్ గౌడ్, జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్ రవికుమార్, సీపీఐ సీనియర్ నాయకుడు కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, పద్మ, కురుమూర్తి, చంద్రకాంత్, నాయకులు మోహన్, ప్రశాంత్, నందు, భరత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో జంగిల్ సఫారీ ప్రారంభం


సఫారీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యంలోని జంగిల్ సఫారీని ఫర్హాబాద్ గేట్ వద్ద వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా మంగళవారం పునఃప్రారంభించారు. 3 కొత్త పర్యాటక వాహనాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నల్లమలలో పర్యాటకాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టును తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ఇక్కడి పర్యాటకాభివృద్ధితో చెంచు యువకులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు మన్ననూరులో ఎమ్మెల్యే, అటవీ శాఖాధికారులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్‌గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, ఎఫ్ఆర్వోలు దేవజ, డీఆర్‌వోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీవోలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

బాపూ మాట.. బంగారు బాట

● అమలు చేస్తే ప్రగతి పరుగులు
● నేడు గాంధీ జయంతి

న్యూస్‌టుడే- అచ్చంపేట, కోస్గి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఆయన మాటలు సమాజ హితానికి బంగారు బాటలు వేస్తాయి. శాంతి, అహింస సిద్ధాంతాలను నమ్మిన మహాత్ముడు వాటితోనే పోరాటం చేశారు. గాంధీజీ అహింస, మద్యపాన నిషేధం, అంటరానితనం నిర్మూల, గ్రామ స్వరాజ్యం, నిజాయతీ, మత సామరస్యం వంటి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటి చెప్పారు.

ఆదర్శం.. అనుసరణీయం

మహాత్ముడు మంచి మార్గం ఎక్కడున్నా అనుసరించాలి

★ **పాలమూరులో ఇలా:** నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూరులో గత 15 ఏళ్లుగా మద్య నిషేధం అమలు చేస్తున్నారు. మాతా మాణికేశ్వరి అహింస, మద్యపాన నిషేధం, శాంతిని భక్తులకు ప్రబోధించే వారు. ఆమె భక్తులు ఇప్పటికీ అనుసరిస్తున్నారు. అచ్చంపేట సమీపంలోని బక్కలింగాయపల్లిలో కూడా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో అత్యధికులు గిరిజనులు ఉండటం విశేషం.

అంటరానితనం అమానుషం

అంటరానితనం అమానుషం. సృష్టిలో అందరూ సమానం. వివక్ష కూడదు.

★ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కృష్ణా మండలం ముడుమాల్‌లో ఇటీవల దళితుల పెళ్లి అడ్డుకున్నారని ఆలయ పూజారిని విధుల నుంచి తొలగించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పౌర దినోత్సవాన్ని నిర్వహిస్తూ అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు.

సత్యమేవ జయతే!

మహాత్ముడు నిజాయతీకి మారుపేరుగా నిలిచారు. చేసిన తప్పులను గుర్తించి సరిచేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

★ ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు ఏళ్ల తరబడిగా ఎన్నికల వాగ్దానాలుగా ఉపయోగపడుతున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. గెలిచిన తరువాత ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదు.

అహింసతోనే విజయం

అహింసతోనే విజయాన్ని సాధించవచ్చని మహాత్ముడు ప్రబోధించారు. భారతదేశాన్ని సుమారు వందల ఏళ్లపాటు పాలించిన ఆంగ్లేయుల బారి నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు అహింస మార్గాన్ని ఎంచుకున్నారు.

★ ఎన్నికల ఘట్టంలో గతంలో హింస చెలరేగి రక్తపాతం చోటు చేసుకునేది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ, ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావు లేకుండా ఎన్నికల సంఘం బాపూజీ ఆశయాలను అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో సఫలీకృతమైంది.


ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (పాత)

మద్య నిషేధంతోనే అభివృద్ధి

మహాత్ముడు మద్యనిషేధంతోనే ప్రగతి సాధ్యమవుతుందని చాటి చెప్పారు. మద్యంతో ఎన్నో అలజడులు చోటు చేసుకుంటున్నాయి. గాంధీజీ బాటలో నడచేందుకు పాలకులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

★ మద్యం ఉమ్మడి జిల్లాలో ఏరులై పారుతోంది. తిమ్మాజిపేట టీసీబీసీఎల్ నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 153 మద్యం దుకాణాలు, 23 బార్లు ఉన్నాయి. నెలకు రూ. 150 కోట్ల విలువైన అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రత్యేక ఉత్సవాలు, పండగలు, ఎన్నికల సమయంలో అదనంగా మరో రూ. 50 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతోంది. నెలకు 2.09 లక్షల కేసుల మద్యం, 2.51 లక్షల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. తాగుడుకు బానిసలై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.



సంపూర్ణ పారిశుద్ధ్యం

మహాత్ముడు సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 32.7 శాతం గ్రామీణ గృహాలకు మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు తేలింది.

★ ప్రధాని మోదీ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా 2014 అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని ప్రతి ఎంపీ తన పరిధిలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో కొంత హడావిడి కనిపించినా పూర్తి స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో ప్రస్తుతం 72 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు.



★ అచ్చంపేట మండలం బక్కలింగాయపల్లిలో వెయ్యి జనాభా ఉంది. తొలిసారి సర్పంచిగా ఎన్నికైన లక్ష్మీలాలునాయక్ కుమారుడు నవీన్‌కుమార్ ఎక్సైజ్ డీఎస్పీగా ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్రీదేవి సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. నాటుసారా బట్టీలు ధ్వంసం చేసి ప్రజల ఆలోచనలో మార్పుతీసుకొచ్చారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. శుద్ధజల కేంద్రంతో అందరికీ నీరందిస్తున్నారు. ఊళ్లో మూడు వేల మొక్కలు నాటి ప్రతి మొక్క సంరక్షణకు ట్రీగార్డ్సను ఏర్పాటు చేయించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చక్కగా నిర్వహిస్తున్నారు.





మహబూబ్‌నగర్ : ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

చిత్తూ చిత్తుల బొమ్మ..
శివుడి ముద్దుల గుమ్మ..

'చిత్తూచిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోన'.. వంటి బతుకమ్మ పాటలతో ఊరూవాడ నాట్యమాడుతోంది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. దసరా సెలవుల కారణంగా విద్యాలయాల్లో కాస్త ముందే బతుకమ్మ సంబరాలు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో కొన్ని స్కూళ్లు, కళాశాలల్లో సందడి చూద్దామా.. - న్యూస్‌టుడే, బృందం


దేవరకద్ర: చౌదర్‌పల్లి వద్ద కళాశాలలో నిర్వహించిన వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు


ఉండవల్లి: అలంపూర్‌చౌరస్తాలో..




వెల్దండ: కొత్తతాండ సమీపంలో ఓ పాఠశాలలో.. పేట డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే పర్ణిక


అచ్చంపేట: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

చదువులకు విరామం.. ఇళ్లకు పయనం







1. సొంత గ్రామాలకు వెళ్తున్న విద్యార్థులు 2. సీటు కోసం సర్కస్ ఫీట్లు 3.బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల చదువులకు కొన్ని రోజులు విరామం లభించింది. బుధవారం నుంచి సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారు మంగళవారం ఇళ్ల బాటపట్టారు. ఈ నేపథ్యంలో గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో కన్పించిన చిత్రాలే ఇవి.

కల్వకుర్తి పురపాలికకు స్వచ్ఛతా గుర్తింపు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి పురపాలికకు అవార్డు ప్రకటించింది. గత నెల 17నుంచి నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంతో పుర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రభుత్వం అభినందించింది. తడి పొడి చెత్తను వేరుచేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు డీఆర్సీ సెంటర్‌ను నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పురకమిషనర్‌కు అవార్డు అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి కార్యాలయం నుంచి పుర కమిషనర్‌కు సమాచారం అందించారు. బుధవారం దిల్లీలో జరిగే స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కమిషనర్ మహమూద్ షేక్, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, సభ్యులు దిల్లీకి బయలుదేరారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం 2017లో కర్నూలుకు చెందిన విజయానంద్ ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి కేసు విషయాలను పరిశీలించి సాక్ష్యులతో విచారణ చేసి మంగళవారం తన తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పీపీ పరందాములు, ఏపీపీ బాలస్వామి, అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్సైలు గడ్డం కాశీ, విజయ్‌కుమార్, సీఐ గాంధీనాయక్, ఏఎస్సై బాలకృష్ణ, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డిలను ఎస్పీ డి.జానకి అభినందించారు.

రాగి జావ ఇచ్చేదెలా?



'మింగ మెతుకులేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్న నానాడి సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో పోషణ జాతర సందర్భంగా మంత్రి సీతక్క చేసిన ప్రకటన చూస్తే గుర్తుకొస్తోంది. అంగన్వాడీల్లో గర్భిణులు, చిన్నారులకు అదనంగా రాగిజావ ఇస్తామని మంత్రి చెప్పారు. ఇప్పుడు ఇస్తున్న నిధులే ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలకు ఏమాత్రం సరిపోని పరిస్థితుల్లో రాగిజావ ఎలా అందజేస్తారన్నది ప్రశ్న.



న్యూస్‌టుడే- నారాయణపేట న్యూటౌన్

ప్రస్తుతం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం కోసం రోజుకు ఒక్కొక్కరికీ 70 పైసలు అందజేస్తోంది. బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరికీ రూ.1.50 చొప్పున ఇస్తోంది. ధన్వాడలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుంటే ఇక్కడ మొత్తం పది మంది పిల్లలు ఉన్నారు. వీరికి అదనంగా ఏడుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని వండి అందించాల్సి ఉంది. ఈ లెక్కన పది మంది పిల్లలకు రోజుకు రూ.7, బాలింతలు గర్భిణులకు రూ. 15 ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రెండింటినీ కలిపితే మొత్తం రూ. 22 ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిగణలోకి తీసుకుంటే రూ.22కు పావుకిలో కూరగాయలూ రావు. వీటితో 20 మందికి పౌష్టికాహారం వండి పెట్టాలంటే ఎలా సాధ్యమో ప్రభుత్వానికే తెలియాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు 'కొన్నది వంకాయ.. కొసిరింది గుమ్మడి కాయ" చందాన్ని తలపిస్తున్నాయి.

● ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినప్పుడు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలనే ముందు పెడుతుంటారు. కొన్ని సందర్భాల్లో కొంతమందికి అదనంగా వండి వడ్డించాల్సి వస్తోంది. ఇది మరికొంత అదనపు భారం. కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు నిబద్ధతతో ఉన్నంతలో మంచి ఆహారం అందించడానికి ప్రయత్నిస్తుండగా, కొన్నిచోట్ల పై నుంచి కింది స్థాయి వరకు చేతులు తడుపుతూ హాజరులో నమోదులో మతలబు చేసి పిల్లల కడుపు కొడుతున్నారు.

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5,548 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారుగా 2.80 లక్షల పిల్లలు, 40వేల దాకా బాలింతలు, గర్భిణులు ఉన్నారు. వీరందరికీ ప్రతిరోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించాలి. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు చాలకపోవడంతో నిర్వాహకులు ఏ కూరగాయ తక్కువ ఉందో దాన్నే కొనుగోలు చేసి వడ్డిస్తున్నారు. మాటి మాటికీ వీటినే పెడుతుండటంతో పౌష్టికాహారం అనే మాటకే విలువే లేకుండా పోతోంది. కొన్ని కేంద్రాల్లో తక్కువ ధరకు వస్తాయని బజార్లలో రెండోరకం సరకు కొంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే మాత్రం కొంత మెరుగ్గా భోజనం ఉంటుంది.

గతంలో వంట గ్యాస్ కోసం ఒక్కొక్క విద్యార్థికీ రోజుకు రెండు పైసలు, బాలింతలు, గర్భిణులకు మూడు పైసలు చొప్పున ఇచ్చేవారు. కొన్ని సంవత్సరాలుగా వీటిని నిలిపేశారు. ప్రస్తుతం సిలిండర్ నిధులను నిర్వాహకులే భరించాల్సి వస్తోంది. గత ఏడాది ఉనుంచి పోపు దినుసుల ప్యాకెట్లను అందజేస్తున్నా, అరకొరగా ఉండటంతో ఏ మాత్రం సరిపోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. మళ్లీ బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూరగాయలకు ఇస్తున్న నిధులు మరీ తక్కువ ఉండటాన్ని గుర్తించకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని కోరుతుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. నిధులు పెంచితే రాగిజావ అందించడం పెద్ద కష్టం కాబోదని అంగన్వాడీ కార్యకర్తలు అంటున్నారు.

ప్రాణం తీసిన అరతులం బంగారం

తోడుగా ఉన్నవాడే నిందితుడు ● వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఒంటరితనానికి ఒక తోడు దొరికిందనుకుంది ఆ మహిళ.. కానీ ఆ తోడే అర తులం బంగారం కోసం తన ప్రాణాలు తీస్తుందని ఊహించలేకపోయింది. షాద్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో ఇటీవల కవర్‌లో దొరికిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు వివరాలు వెల్లడించారు. చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి(40) కొన్నేళ్లుగా ఫరూక్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవించేది. గద్వాల జిల్లా చాగాపూర్‌కు చెందిన వడ్డె రమేష్ తాపీ మేస్త్రీ. వ్యసనాలకు బానిసైన ఇతన్ని భార్యాపిల్లలు వదిలేయడంతో 8 నెలల క్రితం షాద్‌నగర్ వచ్చాడు. ఒకేచోట కూలిపనులు చేసే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఒంటరిగా ఉన్న తనకు ఓ తోడు దొరికిందనే సంతోషంతో ఆమె అడిగినప్పుడల్లా అతడికి డబ్బులు ఇచ్చేది. ఆమె చెవులకున్న అర తులం బంగారు కమ్మలమీద కన్నేశాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. చెవికమ్మలతో పాటు ఇంట్లో ఉన్న రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి మృతదేహాన్ని కవర్‌లో చుట్టి శ్రీనివాసకాలనీలో పారేశాడు. సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు శరత్, సుశీల, శంకర్, సిబ్బంది జోత్స్న, నరేందర్‌లు బృందంగా ఏర్పడి మూడు రోజుల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కేసును వేగంగా పరిష్కరించిన పోలీసులకు ఏసీపీ నగదు రివార్డులు అందజేశారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

అలంపూర్‌లో వైభవంగా ఉత్సవాలు : కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, ఉండవల్లి, న్యూస్‌టుడే: జోగులాంబ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో దసరా ఉత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండాలని, ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపించాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు, దేవాలయం చేరుకునే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఆర్డీవో రాంచందర్, ఈవో పురేందర్, అధికారులు పాల్గొన్నారు.

● అలంపూర్‌చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం కూడలిలో ప్రవేశద్వారాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల వివరాలను ప్రవేశద్వారంపై పొందుపరిచారు.


అలంపూర్‌చౌరస్తా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

సహకార సంఘాల బలోపేతానికి కృషి

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అందరి సమన్వయ సహకారంతో తనవంతు కృషి చేస్తామని డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించాక.. తొలిసారిగా మానవపాడు సహకార సంఘం కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. కలుకుంట్ల గ్రామానికి చెందిన ఓ రైతుకు రుణమాఫీ కాకపోవడంతో సొసైటీ అధికారులను నిలదీశారు. డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అయ్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాట 65, వంకాయ 40, బెండ 45, మిర్చి 50, కాకర 65, బీర 60, కాలీఫ్లవర్ 70, క్యాబేజీ 45, క్యారెట్ 65, దొండ 48, ఆలుగడ్డ 46, ఉల్లిగడ్డ 55, గోకర 65, దోస 40, ఆనపకాయ 18, చిక్కుడు 65, మునగకాయ 80, బీట్‌రూట్ 65, బీర 40, బీన్స్ 90.

సదరం శిబిరాల తేదీలు ఖరారు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో అక్టోబర్ నెలలో నిర్వహించే సదరం శిబిరాల తేదీలు ఖరారు చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి చిన్న ఓబులేశ్ మంగళవారం తెలిపారు. ఈనెల 8, 15, 22, 29 తేదీల్లో శారీరక దివ్యాంగులకు, 16, 23న వినికిడి లోపం ఉన్న వారికి, 7, 23న కంటి చూపు లోపం ఉన్న వారికి, 16, 23న మానసిక దివ్యాంగులకు శిబిరాలు నిర్వహిస్తామని సూచించారు. అర్హత కలిగిన వారు ఈనెల 3 నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకోవాలన్నారు.

వైద్య పోస్టులకు మౌఖిక పరీక్షలు

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర వైద్యవిధాన పరిషత్తు ఆధ్వర్యంలో పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో ఒప్పంద పద్ధతిలో రెండు సివిల్ సర్జన్ పోస్టులు, 8 మంది ప్రత్యేక వైద్యులను భర్తీ చేస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా. రఘు మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 4న ఆసుపత్రిలో నిర్వహించే మౌఖిక పరీక్షలకు హాజరు కావాలన్నారు.

వృద్ధులను ఆదరించాలి



వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న రాజేశ్వరి, నాగరాజు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : వృద్ధులను ఆదరించాలని డీడబ్ల్యూవో అధికారిణి రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా విశ్వశాంతి వేద వృద్ధాశ్రమంలో మంగళవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి మాట్లాడారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలో వృద్ధులను సన్మానించారు. ఆర్డీవో నాగరాజు, సీడీపీవో వెంకటరమణ, టీచర్లు శోభ, భాగ్యలక్ష్మి, హుస్సేనమ్మ పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు అధికారి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం పెద్దకొత్తపల్లి ఠాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కేసుల పరిష్కారం, శాంతిభద్రతలపై ఎస్సై సతీష్‌కు ఆరా తీశారు. అంతకుముందు సిబ్బంది గౌరవ వందనం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ఆందోళన

కల్వకుర్తి, న్యూస్‌టుడే : మండలంలోని గుండూరు గ్రామ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మంగళవారం పాఠశాల ఎదుట తల్లిదండ్రులతో కలసి నిరసన తెలిపారు. మూత్రశాలలకు పైపులైన్ సౌకర్యం లేకపోవటంతో వినియోగంలో లేవని, ఆరుబయటకు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ సెలవుల్లో పెండింగ్ పనులు గుత్తేదారుతో చేయిస్తామని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ దుర్గాప్రసాద్ తెలిపారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి సహకారం



మాట్లాడుతున్న ట్రస్ట్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, న్యూస్‌టుడే : విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆర్థిక సహకారం అందిస్తామని ట్రస్ట్ సీఈవో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని వసతి సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పంతులునాయక్, గణ్యానాయక్, దేశ్యానాయక్, లాలూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమజంటకు వివాహం

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న యువతి యువకుడు 3 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కొద్ది రోజులుగా యువతి వివాహం చేసుకోవాలని యువకుడిని కోరగా ఒప్పుకోకపోవడంతో యువతి పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం పోలీసులు వారి కుటుంబ సభ్యులను, యువకుడిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వివాహం చేసుకునేందుకు యువకుడు అంగీకరించడంతో స్టేషన్ ఆవరణలోనే దండలు మార్చుకుని ఒక్కటయ్యారు.

అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపడం తగదు
మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ పోలీస్ అధికారులు చేసే పనులకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సబ్ జైల్‌లో ఉన్న భారాస నాయకుడు పాలమూరు శివను పరామర్శించారు. అనంతరం స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోత్బలంతోనే పోలీసులు తమ కార్యకర్తను అరెస్ట్ చేశారన్నారు. అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించే సంస్కృతిని మానుకోవాలని సూచించారు. గడిచిన తొమ్మిది నెలల కాలంలో అభివృద్ధి పనులకు ఒక్క కొత్త జీవో రాలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో భారాస నాయకులు పులేందర్‌రెడ్డి, అర్థంరవి, వెంకటయ్య, నాగయ్య, మాదవరెడ్డి, కేశవులుగౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, మన్యప్‌రెడ్డి, బాలగౌడు తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్: ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో నాగరాజు



అచ్చంపేట: ఎస్‌బీఆర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో..



తాడూరు ఉన్నత పాఠశాలలో..



నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఘనంగా బతుకమ్మ ముందస్తు సంబరాలు

దసరా పండుగను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో పాఠశాలల్లో బతుకమ్మ పండుగ నిర్వహించారు. డీఈవో గోవిందరాజులు బతుకమ్మ వద్ద పూజలు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ ఆడారు. కల్వకుర్తి పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు విద్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణ సమీపంలోని కుంటల్లో నిమజ్జనం చేశారు. కల్వకుర్తి మండలంలోని తాండ్ర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో బతుకమ్మలను తయారు చేసి ఆర్డీవో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్, అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ ఆడారు. ఆర్డీవో నాగరాజు, ట్రస్మా అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, గౌరవాధ్యక్షుడు రామానుజం పాల్గొన్నారు. అచ్చంపేట మండలం కొండనాగుల జడ్పీ పాఠశాల, శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ నిర్వహించారు. తెలకపల్లి, తాడూరు, వెల్దండ, తిమ్మాజీపేట మండలాల్లోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బతుకమ్మలు ఉంచి ఆటలు ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. కోడేరు మండలం రాజాపూర్, కోడేరు ఉన్నత, ఆదర్శ పాఠశాలల్లో, కోడేరు ఎస్సీ కాలనీలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పెద్దకొత్తపల్లి మండలంలోని పెద్దకార్పాముల, చెన్నపురావుపల్లి, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండల కేంద్రంలోని పాఠశాలల్లో బతుకమ్మ నిర్వహించారు. అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లింగాల, ఉప్పునుంతల ఉన్నత పాఠశాలల్లో బతుకమ్మలను రకరకాల పూలతో అలంకరించారు. - న్యూస్‌టుడే బృందం



కోడేరు : రాజాపూర్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు



అచ్చంపేట: బతుకమ్మ వేడుకలో చిన్నారులు



తెలకపల్లిలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



పెంట్లవెల్లి జడ్పీ బాలికల పాఠశాలలో...

‘శుద్ధజలం అందించే బాధ్యత సహాయకులదే’



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీధర్‌రావు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించే బాధ్యత పంచాయతీ సహాయకులదేనని వాటర్‌గ్రిడ్ ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ మంచినీటి సహాయకులకు 4 రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, డీఈఈలు మణిపాల్, సంధ్యారాణి, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, ఏఈలు లలిత, రోహిత్, ప్రతిభ, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

కల్వకుర్తి, న్యూస్‌టుడే: పల్లెల్లో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత గ్రామ నీటిసహాయకుల పై ఉందని జిల్లా ఇంద్ర పథకం ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మిషన్ భగీరథ పథకం గ్రిడ్‌లో గ్రామ తాగునీటి సహాయకులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో వెంకట్‌రాములు, డీఈఈ సంధ్యారాణి, మణిపాల్ సూచనలు ఇచ్చారు. ఏఈ ఆకాశ్, సంతోశ్, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి అవసరం



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో అధికారులు

కందనూలు, న్యూస్‌టుడే : విద్యార్థులు సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా సైన్సు అధికారి రాజశేఖర్‌రావు సూచించారు. పట్టణంలోని జాతీయ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి సైన్సు డ్రామా, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. డ్రామా పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మొదటి బహుమతి, బల్మూరు కేజీబీవీ రెండో, జడ్పీ ఉన్నత పాఠశాల సిర్సవాడ మూడో బహుమతి సాధించింది. జానపద నృత్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల పెద్దపల్లి మొదటి స్థానం, తెల్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల రెండో, బల్మూరు కేజీబీవీ మూడో స్థానం సాధించాయి. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి శర్పుద్దీన్, ఉపాధ్యాయులు సురేశ్‌బాబు, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా కొల్లాపూర్ డిపో నుంచి హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు దాదాపు 58 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డీఎం ఉమాశంకర్‌గౌడ్ చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణంలో మంగళవారం ప్రయాణికులతో మాట్లాడారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, తదితర అంశాలపై ఆరా తీశారు. కొల్లాపూర్, నార్లాపూర్ మీదుగా లింగాలకు బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ ఇన్‌చార్జి రత్నమ్మ, కంట్రోలర్ బిచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి: డీఆర్డీవో



కోళ్ల పెంపక కేంద్రం ప్రారంభించి కోడిపిల్లలను పరిశీలిస్తున్న డీఆర్డీవో తదితరులు

తెలకపల్లి,న్యూస్‌టుడే : స్వయం సహాయక మహిళా సంఘాలు వివిధ రకాల జీవనోపాదులు చేపట్టి ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో చిన్న ఓబులేశ్ అన్నారు. మండలంలోని వట్టిపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా నీలం లలిత ఏర్పాటు చేసుకున్న కోడి పిల్లల పెంపకం యూనిట్‌ను డీఆర్డీవో ప్రారంభోత్సవం చేశారు. గ్రామీణ అభివృద్ధి సంస్థ- శ్రీనిధి ద్వారా రూ.2.50 లక్షలు రుణం మంజూరు చేయగా లబ్ధిదారు ఓ షెడ్డులో 2వేల కోడిపిల్లలు దిగుమతి చేసుకుని యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అదనపు డీఆర్డీవో లక్ష్మినారాయణ, శ్రీనిధి ఆర్‌ఎం మహేంద్రకుమార్, డీపీఎంలు వెంకటేశ్, అరుణాదేవి, ఏపీఎం నిరంజన్, సీసీలు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించాలి

తాడూరు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్, ఇతర వస్తువులతో ఉపయోగకరమైన వస్తువుల తయారీ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన అలంకరణ వస్తువులను పరిశీలించి అభినందించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో జ్యోతి పరూసియా, ఎంపీవో బ్రాహ్మచారి, ఎస్‌వో విజయ, కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

రుణాలివ్వాలని ధర్నా

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని పెద్ద కార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకు ముందు భాజపా ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వడంలేదని, గతంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని భాజపా మండలాధ్యక్షుడు పదిర బీమేష్ డిమాండ్ చేశారు. గతంలో పలువురి ఖాతాల నుంచి సొమ్ము పక్కదారి పట్టినా బాధితులను ఆదుకోలేదన్నారు. బ్యాంకును మండల కేంద్రానికి తరలించాలని కోరారు. అనంతరం నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. బ్యాంకు తిరుమల్, సతాని శ్రీను, మేకల శివ, సిద్ధార్థ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తీర్చేందుకు చర్యలు



తిమ్మాజిపేట పీఏసీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : తిమ్మాజిపేట (గొరిట) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో సమస్యలున్నట్టు, బ్యాంకు కార్యకలాపాలు నిలిచినట్టు తెలిసిందని వాటిని తర్వలో పునరుద్ధరించడంతో పాటు రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని ఉమ్మడి మహబూబ్‌నగర్ డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం డీసీసీబీ సీఈవో పరమేశ్వర్, ఏజీఎం రమేశ్‌తో పాటు తిమ్మాజిపేట పీఏసీఎస్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందిన రుణమాఫీ సొమ్ము ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని, కొందరు రైతులు రుణాలు చెల్లించినా ఇప్పటికీ అలాగే రుణం ఉన్నట్టుగా ఫిర్యాదులొచ్చాయని, సిబ్బందికి నెలలుగా జీతాలివ్వలేదని వచ్చిన ఆరోపణలు నిగ్గుతేలాల్సి ఉందన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు రాందేవ్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులున్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు సంక్షేమ పథకం ధ్రువీకరణ పత్రాలను పురపాలిక అధ్యక్షురాలు మేకల రమ్య మంగళవారం అందించారు. అదేవిధంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో పురపాలికలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షుడు మహమూదా బేగం, కౌన్సిలర్లు నరసింహారావు, మేకల శిరీష, పిన్నంశెట్టి జ్యోతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం ఎన్నికల్లో సూర్యప్రకాశరావు విజయం



సూర్యప్రకాశరావుతో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పుర ఛైర్మన్ సత్యం

కల్వకుర్తి, న్యూస్‌టుడే: కల్వకుర్తి సమీపంలోని ఓ పత్తి మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడిగా సూర్యప్రకాశరావు విజయం సాధించినట్లు ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ అదనపు కమిషనరు, ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. మొత్తం 450 ఓట్లు ఉండగా ఉదయం 7 గంటల నుంచి 2 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో 438 పోలయ్యాయి. భారాస మద్దతు తెలిపిన అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావుకు 251 ఓట్లు, ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌కు 183 ఓట్లు వచ్చాయని చెప్పారు. సూర్యప్రకాశరావు 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ప్రకటించారు. నాలుగు ఓట్లు చెల్లుబాటు కాలేదు. ఎన్నికల్లో కార్మిక శాఖ అధికారులు బీఎన్.స్వామి, మహేశ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు. ఈ గెలుపుతోనే కాంగ్రెస్ పతనం మొదలైయిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కార్మిక సంఘం విజయోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పత్తి మిల్లు నుంచి ప్రారంభమైన ర్యాలీ పురపాలిక కార్యాలయం వరకు సాగింది. మైసమ్మ ఆలయంలో పూజలు చేసిన అనంతరం పట్టణంలో బాణసంచా పేల్చారు. పుర ఛైర్మన్ సత్యం, మాజీ ఛైర్మన్ శ్రీశైలం, షాహెద్, భోజిరెడ్డి, విజయ్‌గౌడ్, కృష్ణారెడ్డి, వెంకటయ్యగౌడ్, బాలయ్య, లింగం, మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

కందనూలు, న్యూస్‌టుడే : మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దముద్దునూర్‌లో మంగళవారం గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణరావు, స్వామి, శ్రీకాంత్‌రావు, భగవంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ భూమి సర్వే



తెలకపల్లిలో సర్వేలో పాల్గొన్న అధికారులు తదితరులు

తెలకపల్లి,న్యూస్‌టుడే : మండల కేంద్రంలో మంగళవారం ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చెందిన 542 సర్వే నంబర్ భూమిలో 12.06 ఎకరాల భూమిలో అధికారులు సర్వే చేశారు. ఆలయ భూమిలో ఆక్రమణల ద్వారా దుకాణ సముదాయం నిర్మించారని ఆక్రమణలకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో సర్వే సాగుతోంది. ఇప్పటికే ఇక్కడ రెండు పర్యాయాలు పూర్తికాగా చివరగా మూడోసారి సర్వే చేశారు. సర్వే డీఐ, ఆర్ఐ రామస్వామి, సర్వేయర్ హరీశ్‌రెడ్డి, ఆలయ ఈవో ఎం. నర్సింహులు సిబ్బంది ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అక్కడున్న విలేకరులతో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ చరవాణిలో మాట్లాడుతూ.. మామిళ్లపల్లి దేవాలయం భూములు తెలకపల్లి, కార్వంగ, దాసుపల్లి, పర్వతాపూర్, తర్నికల్ తదితర చోట్ల భూముల్లో కొందరు ఆక్రమణలు చేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలకు గురైన భూములు రక్షించి.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, ఎస్సై నరేశ్, సిబ్బంది, రైతులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

కందనూలు, న్యూస్‌టుడే : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు ఆసుపత్రి పర్యవేక్షకుడు డా. రఘు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేశ్‌రెడ్డి, కన్వీనర్ కుమార్, ఆర్‌ఎంవో డా. దశరథం, వైద్యుడు డా. రోహిత్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి.. పెంట్లవెల్లి, న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లి, చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రామన్‌గౌడ్ కథనం ప్రకారం.. పెంట్లవెల్లికి చెందిన జంగిటి ఆంజనేయులు(అంజి) (35) సోమవారం చౌట చెరువులో చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహన్ని కొల్లాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆంజనేయులు (పాతచిత్రం)

అదృశ్యమైన మహిళ..బావిలో పడి.. వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఓ మహిళ బావిలో శవమై కన్పించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కురుమూర్తి కథనం ప్రకారం.. వెల్దండ మండలం చెర్కూర్ గ్రామానికి చెందిన కేశమోని లక్ష్మమ్మ(60) అదే గ్రామంలోని ఓ బావిలో పడి మృతిచెంది విగతజీవిగా కన్పించింది. సెప్టెంబర్ 29న ఇంట్లో పొలానికి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వారి పొలంలోని బావిలో నీటిని సోమవారం రాత్రంతా తోడేసినా ఫలితం లేదు. ఇతర బావులలో వెతకగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఎస్సై కురుమూర్తి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త కృష్ణయ్యగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాత్కాలిక ఉద్యోగి ఆత్మహత్య.. తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : అనారోగ్య సమస్యతో వైద్యశాఖ తాత్కాలిక (కాంట్రాక్టు)ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎదిరపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్ రెడ్డి వివరాల మేరకు... గ్రామానికి చెందిన ఆశన్న(48) మంగళవారం ఉదయం భార్య బయట పనిచేసుకుంటుండగా ఇంట్లో గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. గుర్తించిన భార్య వెంటనే ఇరుగు పొరుగు వారిని పిలిచి తలుపులు విరగొట్టి కిందకు దించారు. ఊపిరితో ఉన్నట్టు గుర్తించి వెంటనే తిమ్మాజిపేట, జడ్చర్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. కొద్దిరోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు చెప్పారు. మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్లు భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్టుకు ఉరేసుకుని .. కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో చెట్టుకు ఉరివేసుకుని వాసు(55) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రెండో ఎస్ఐ రాంచందర్‌జీ కథనం ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న వాసు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసై తరచు ఇంట్లో గొడవ పడుతుండేవాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మార్కెట్‌లో చెట్టుకు ఉరేసుకున్న విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం.. లింగాల, న్యూస్‌టుడే : దుంపల కోసం అడవిలోకి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా...ఎర్రపెంటకు చెందిన స్నేహితులు నిమ్మల శంకర్, కృష్ణ దుంపల కోసం శనివారం నల్లమల అడవిలోకి వెళ్లారు. దుంపలు దొరకపోవడంతో రాత్రి అక్కడే నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున శంకర్ కనిపించకపోవడంతో కృష్ణ పరిసర ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. శంకర్ భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటేశ్వర్లు వివరించారు.

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : మండలంలోని ఎదిరపల్లి గ్రామానికి చెందిన బక్కయ్య(60) అదృశ్యమైనట్టు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. గత నెల 19న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని ముక్కిడిగుండం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని పెద్దపురం సాకలి ఎల్లయ్య(20) సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజుల నుంచి వెదుకుతున్నామని తల్లిదండ్రులు శేషమ్మ, నారాయణ తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై హృషికేశ్ చెప్పారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు.. కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదిన సంఘటన సోమవారం చోటు చేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థి పదోతరగతి చదువుతున్నాడు. సోమవారం ఉపాధ్యాయుడు పాఠం బోధిస్తుండగా విద్యార్థి నవ్వడంతో చేతిలో ఉన్న కర్రతో విచక్షణ రహితంగా కొట్టడంతో విద్యార్థి శరీరంపై వాతలు పడ్డాయి. తల్లిదండ్రులు గమనించి మంగళవారం ఉదయం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంఘటనపై విచారణ చేస్తామని డీఈవో గోవిందరాజులు తెలిపారు.

హత్య కేసులో ఐదుగురికి రిమాండ్.. డిండి, న్యూస్‌టుడే: కూతురు వరుసయ్యే బాలికను తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడని పగ పెంచుకొని ఓ వ్యక్తిని అతని తోడల్లుడు, కుమారులు హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లాలో సెప్టెంబరు 27న చోటు చేసుకుంది. ఈ హత్య కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ గిరిబాబు వివరాల ప్రకారం. . నల్గొండ జిల్లా డిండి మండలం కామెపల్లికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కోప్పోలుకి చెందిన శ్రీపతి జగదీష్‌కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. రమాదేవి సోదరిని నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలానికి చెందిన వ్యక్తికిచ్చి వివాహం చేశారు. తోడల్లుడి కుమార్తెతో జగదీష్‌కు పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరూ ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. బాలికను కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రులు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జగదీష్ బాలికతో కలిసి ఉంటున్న ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో బంధువులకు పంపించడం మొదలు పెట్టాడు. పరువు పోతుందని తోడల్లుడు సెప్టెంబరు 27న ఇద్దరు కుమారులతోపాటు భార్య, మరదలు రమాదేవితో కలిసి అల్వాల్‌కి వెళ్లారు. జగదీష్‌ను చెర్కుపల్లికి తీసువచ్చి హత్య చేశారు. సెప్టెంబరు 28న గుర్తు తెలియని శవం ఉందని రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారించారు. కుమారులతో కలిసి హత్య చేసినట్లు తోడల్లుడు ఒప్పుకున్నాడు.